RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | సంపుటి : 3, సంచిక : 109 | గురువారం | మార్చి 20, 2025 | పేజీలు : 4 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ.. నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379



- ఈనెల 25న సుప్రీం కోర్టులో విచారణ
- ఇప్పటికే ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు
- అనర్హత వేటు పడితే ఏమి చేయాలనే సమాలోచనలు
- కాంగ్రెస్‌లో చేరలేదని అఫిడవిట్ల సమర్పణ?

# డబ్.. డబ్...!?

## ఫిరాయింపు ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు పరుగులు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేల పరిస్థితి అయోమయంలో ఉన్నట్టు పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. ఈ నెల 25న జరిగే సుప్రీం కోర్టు విచారణలో తమకు వ్యతిరేకంగా తీర్పు వస్తుందని సదరు ఎమ్మెల్యేలు భావిస్తున్నారా..?. ఇప్పటికే అందిన నోటీసులతో ఆగమాగవుతున్న ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై రోజు రోజుకి పెరుగుతున్న వ్యతిరేకతతో ఉప ఎన్నికల్లో ఓటమి ఖాయం అని ఫిక్స్ అయ్యారా..?అందుకే సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తాము కాంగ్రెస్ లో చేరలేదని వాంగ్మూలం ఇచ్చారా..? అంటే అవుననే తెలుస్తుంది.

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన పటాన్ చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సుప్రీం కోర్టుకు సమర్పించిన వాంగ్మూలంలో "నేను కాంగ్రెస్ పార్టీలో చేరలేదు. నేను ఇంకా బీఆర్ఎస్ లోనే ఉన్నాను.. నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసమే సీఎం రేవంత్ రెడ్డిని అనేక సార్లు కలిశాను.. ఓ ప్రజాప్రతినిధిగా ఎవర్ని అయిన కలిసే హక్కు ఉంది కాబట్టి నేను మంత్రులను సైతం కలుస్తున్నాను. అంతమాత్రాన నేను పార్టీ మారినట్లా.. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకెళ్లి ప్రధాని మోదీతో సహా పలువురు కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. అంతమాత్రాన సీఎం కాంగ్రెస్‌ను వదిలి బీజేపీ లో చేరినట్లా.. నేను కూడా అంతే..కొన్ని మీడియా ఛానెళ్లు.. నేనంటే గిట్టని వాళ్లు అసత్య ప్రచారం చేస్తున్నారు.. ఇప్పటికి నా క్యాంప్ ఆఫీసులో మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫోటో ఉంటుంది" అని సుప్రీంకు సమర్పించిన అఫిడవిట్ లో పేర్కొన్నారు..

మరో ఎమ్మెల్యే గద్వాల్‌కు చెందిన బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన బండ్లకృష్ణమోహన్ రెడ్డి ఏకంగా "నా ఫోటోలను కాంగ్రెస్ పార్టీ బ్యానెర్లలో..ఫ్లెక్సీలల్లో పెడితే నేనే స్వయంగా పీఎస్‌లో కేసు పెట్టాను..నేను కాంగ్రెస్ లో చేరితే నేనేందుకు కేసు పెడ్తాను..ఇంకా నేను బీఆర్ఎస్‌లోనే ఉన్నాను" అని బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అఫిడవిట్‌లో తెలిపారు.జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అయితే ఏకంగా " నేను పార్టీ మారలేదు. నేను బీఆర్ఎస్ లోనే ఉన్నాను " అని పేర్కొన్నారు.. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు "నేను అధికారక కార్యక్రమాల్లో మాత్రమే

మిగతా 4వ పేజీలో..



# చాయ్ ఇస్తావా.. గంజాయి కేసు పెట్టనా..?

- చాయ్ వాలాపై ఖాకీ జులుం తగునా?
- ఒకటి రెండు అంటే ఫ్రీగా ఇవ్వగలము...
- రోజు 6, 7 ఫ్రీగా అంటే ఎలా సార్?
- ఎస్సై తలుచుకుంటే గంజాయి కేసు పెట్టి లోపల వేయగలడు..! డబ్బా మూయించగలడు..!
- సామాన్య చిరు మనిషి పై పోలీసుల ప్రతాపం..!

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

"ఏ బాబు ఫాస్ట్‌గా ఆరు చాయ్‌లు పార్సెల్ చెయ్.. అమ్మ..ఓకే సార్ 6 చాయ్‌లకు రూ.60 అవుతుంది. నన్నే డబ్బులు అడుగుతావా... నేనెవరో తెలుసు కదా కానిస్టేబుల్‌ని.. నిజమే సార్ కానీ ఒకటి రెండు అంటే ఫ్రీగా ఇవ్వగలను. కానీ రోజు ఇలా ఆరు.. ఏడు చాయ్ లు ఫ్రీగా ఇవ్వాలి అంటే మేము చేసుకొని బతికే వాళ్లం.. కొంచెం చూడండి సార్.. ఆహా నేను చెప్పిన వినవా? ఆగు మా ఎస్సైతో చెప్పిస్తాను.. నువ్వే ఎస్సైకి ఫోన్ చేసి అడుగు రా.. నంబర్ ఇస్తాను.. హా ఇవ్వండి సారు.."

"హలో సార్ నేను చాయ్ డబ్బా నుంచి కాల్ చేస్తున్నాను.. ఏడు చాయ్‌లు ఇచ్చాను.. మరీ డబ్బులు సార్.. ఏమిరా మెదడు తక్కువోడా.. హౌలే.. నాకు ఫోన్ చేసి నన్నే డబ్బులు అడుగుతావా.. ఉన్నత అధికారులు వచ్చారు. తొందరగా పంపించు రా..అయినా మీకు తమాషాలు ఎక్కువయ్యాయి. భయం లేకుండా పోయింది. నేను తలుచుకుంటే నువ్వు గంజాయి అమ్ముతున్నావని కేసు పెట్టి లోపల వేయించగలను. అవసరమైతే నీకు డబ్బా ఎంజీఎంలో లేకుండా చేయిస్తాను.." అంటూ

మిగతా 4వ పేజీలో..

# బడ్జెట్‌లో విద్యకు మొండి చేయి

- ఎన్నికల ప్రచారంలో ప్రతి బడ్జెట్‌లో 15శాతం ఇస్తామని హామీ
- తీరా బడ్జెట్ లో శూన్యహస్తం
- కాంగ్రెస్ పాలనలో విద్యవ్యవస్థ అస్తవ్యస్తం
- బడ్జెట్ లోనూ అదే ప్రతిబింబం

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**



తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి 2025-26 ఏడాదిగానూ రూ.3,04,965 కోట్లతో వార్షిక బడ్జెట్ ను ఉప ముఖ్యమంత్రి..ఆర్థిక శాఖ మంత్రి భట్టీ విక్రమార్క మల్లు బుధవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. గత ఎన్నికల ప్రచారంలో అప్పటి పీసీసీ చీఫ్.. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారానికి వెళ్లిన ప్రతి చోట విద్యా రంగానికి ప్రతి బడ్జెట్ లో 15శాతం నిధులు కేటాయిస్తామని ఊకదంపుడు మాటలు చెప్పారు.

తీరా అధికారంలోకి వచ్చాక తొలిసారి ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ లో విద్యకు నిధులు కేటాయింపులో వివక్షతను చూపారు. తాజాగా ఉప ముఖ్యమంత్రి భట్టీ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి మంత్రిగా ఉన్న విద్యాశాఖకు బడ్జెట్‌లో గత ఏడాది కంటే తక్కువ కేటాయింపులు చేశారు..

రూ.304965 కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖకు కేటాయించింది రూ.23108 కోట్లు(7.57శాతం) మాత్రమే..గతేడాది రూ.2,74,058 కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖకు కేటాయించింది రూ.21292 కోట్లు(7.77శాతం). గత సార్వత్రిక ఎన్నికలకు ముందు బడ్జెట్‌లో 15శాతం విద్యాశాఖకు కేటాయిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న కాంగ్రెస్ పార్టీ తీరా అధికారంలోకి వచ్చాక మాత్రం ఆ హామీని తుంగలో తొక్కినట్లు అయింది.

# సీఎం సాబ్.. ఎంజీఎంకు రండి!

- ఒక్క మంత్రికి కూడా పెద్దాస్పత్రిపై శ్రద్ధ లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి పేదలంటే చులకన
- ఎంజీఎం వైపు కన్నెత్తి చూడని హెల్త్ మంత్రి
- ముఖ్యమంత్రి ఆస్పత్రికి రావాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

"వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు..మంత్రులు గడీదాటి బయటికి రండీ.. ఒక్కసారి ఎంజీఎం దుస్థితి చూడండి" అంటూ బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులపై మండిపడ్డారు. పేదల ఆస్పత్రి అయిన మహాత్మా గాంధీ మెమోరియల్ హాస్పిటల్(ఎంజీఎం)కు రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కసారి రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంజీఎం దయనీయస్థితిపై 'వరంగల్ ప్రజల ఆత్మగౌరవ పోరాటం' పేరుతో బుధవారం ఎంజీఎం ఆస్పత్రి ముందు బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగారు. ఈ మహాధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఎంజీఎంలో కనీసం వీల్‌చైర్లు, స్ట్రేచర్లు, బెడ్లు, ఆక్సిజన్, 2డీ, ఈసీజీ లాంటి మౌలిక వసతులు కూడా లేవని ఆరోపించారు. వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ఉన్నా ఏం లాభం అంటూ మండిపడ్డారు. సీఎం వద్దకు వెళ్లి పేదల ఆస్పత్రి అయిన ఎంజీఎం దుస్థితి వివరించలేని దద్దమ్మలు అంటూ ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన సురేఖ ఒక్కరోజైనా ఆస్పత్రి గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. ఆమెకు కావాల్సింది ఓట్లు, రాజభోగాలు మాత్రమేనని, ప్రజలు ఏమైనా ఆమెకు పట్టదని, అవసరమైతే తప్ప గడి నుంచి బయటకు రారని ఆరోపించారు.

### రేవంత్ సర్కార్ అన్నివిధాలా విఫలం : గంట రవికుమార్

సీఎం రేవంత్‌రెడ్డి ఓ అసమర్థ సీఎం, ఆయన పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని గంట రవికుమార్ విమర్శించారు. వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధాని చేస్తానని ఊకదంపుడు ప్రచారం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఉత్తర తెలంగాణకే పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎంలో సమస్యలు తాండవిస్తుంటే ఒక్కసారైనా ఆస్పత్రిని విజిట్ చేశారా అంటూ సూటిగా ప్రశ్నించారు. ఒక్కసారి ఎంజీఎంకు రా... పేద బిడ్డల ఆక్రందనలు ఏమిటో తెలుస్తాయంటూ హితవు పలికారు. ఇక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఉన్నాడా అన్న అనుమానం వస్తోందని రవికుమార్ ఎద్దేవా చేశారు. కనీసం ఆయనకు ఎంజీఎం అంటూ ఒకటి ఉందన్న విషయం తెలియనట్టుందని విమర్శించారు. ఏళ్ల నుంచి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేనితనంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి అధ్వానస్థితికి చేరిందని, మౌలిక వసతులు కల్పించి ఆస్పత్రిని బతికించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా ఉత్తర తెలంగాణకు పేదలకు పెద్ద దిక్కుగా, వేలాది మంది ప్రాణాలు కాపాడిన ఎంజీఎం ఆస్పత్రి.. పాలకుల నిర్లక్ష్య వైఖరితో దయనీయంగా మారిందని మండిపడ్డారు. సరైన వైద్యులు లేక వైద్యం అందని ద్రాక్షగానే మారిందన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఖాళీలను భర్తీ చేయడం లేదని ప్రభుత్వాన్ని తప్పుబట్టారు. ఎంజీఎంకు ఇన్‌చార్జి సూపరింటిండెంట్‌తోనే కాలం వెల్లదీస్తున్నారని, దాంతో వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా ఎంజీఎంలో సరిపడా బెడ్లు లేకపోవడంతో ఒకే బెడ్డుపై ఇద్దరుముగ్గురుని పడుకోబెట్టాల్సిన దుస్థితి వచ్చిందని, పాలకుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమని రవికుమార్ ధ్వజమెత్తారు. ఎక్కడపడితే అక్కడే బయో వ్యర్థాలను పడుస్తున్నారంటూ మండిపడ్డారు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు కమీషన్లు, ఆధిపత్య పోరు తప్ప ఎంజీఎంను బాగు చేయాలన్న సోయి ఏమాత్రం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పాలకులు స్పందించాలన్నారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మారుతినేని ధర్మారావు రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్, కంభంపాటి పుల్లారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, వన్నాల వెంకటరమణ, చాడ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరి శంకర్, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మరియు రాష్ట్ర, జిల్లా నాయకులు వివిధ మోర్చాల నాయకులు, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# యనమల రామకృష్ణుడి శకం ముగిసినట్టేనా?



కాకినాడ : తెలుగుదేశం పార్టీలో అత్యంత సీనియర్ నాయకుల్లో ఒకరు యనమల రామకృష్ణుడు.. తెలుగుదేశం ఆవిర్భావం నాటి నుంచి చట్టసభల్లో ఏదో ఒక పదవిలో కొనసాగుతూ వచ్చిన యనమలకు ప్రస్తుతం ఎమ్మెల్సీ పదవీకాలం ముగియడంతో ఏ పోస్టు లేకుండా పోయింది.. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఆయనకు ఈ సారి ఎమ్మెల్సీ పదవి రెన్యువల్ చేయలేదు.. దాంతో రాజకీయాల్లో యనమల రామకృష్ణుడి శకం ముగిసిందా అన్న చర్చ మొదలైంది. నాలుగు దశాబ్దాలకు పైబడిన రాజకీయ జీవితంలో తొలిసారి చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండాపోయిన యనమల పొలిటికల్ ఫ్యూచర్‌పై పెద్ద చర్చే జరుగుతోందిప్పుడు.టీడీపీలో అత్యంత సీనియర్ నేతలుగా కొనసాగుతున్న నేతల్లో యనమల రామకృష్ణుడు ఒకరు. అశోక్ గజపతి రాజు, యనమల రామకృష్ణుడు, షరీఫ్ వంటి సీనియర్లు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. యనమల రామృకృష్ణుడు తొలిసారి 1983లో ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఏదో ఒక చట్టసభకు ప్రాతినిధ్యం వహిస్తూనే ఉన్నారు. మంత్రిగా, స్పీకర్‌గా, ప్రధాన ప్రతిపక్ష నాయకుడి గా అనేక కీలకపదవులు నిర్వహించారు. 73 ఏళ్ల వయస్సులోనూ రాజకీయాల్లో యాక్టివ్ గానే ఉంటున్నారు.అయితే పార్టీలో యువతను ప్రోత్సహించాలనే కొత్త ఫార్ములాను టిడిపి ఈమధ్య ఆచరణ లో పెడుతోంది. దాని కారణంగా యనమల లాంటి సీనియర్లను పక్కన పెడుతున్నారు అనే ప్రచారం పార్టీలోనే సాగుతోంది. యనమల కుమార్తె దివ్య ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా తుని శాసనసభ్యురాలి గా ఉన్నారు. 1983 నుండి 2004 వరకూ 6 సార్లు ఎమ్మెల్యే గా యనమల రామకృష్ణుడు గెలిచిన నియోజకవర్గం అది. 2009 లో తొలిసారి ఓటమి చెందినా ఆయనకు కీలక పదవులు ఇచ్చి టీడీపీ గౌరవించింది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఎమ్మెల్సీగా ఉన్న యనమలకు చంద్రబాబు మంత్రిపదవి కట్టబెట్టారు. పార్టీ అధికారంలో లేనప్పుడు సైతం పీఏసీ ఛైర్మన్ వంటి పదవులు ఇచ్చారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న యనమల రామకృష్ణుడి పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. అయితే ఈసారి ఆయనకు ఎమ్మెల్సీగా ఛాన్స్ ఇవ్వకపోవడంతో పొలిటికల్ గా యనమల కెరీర్ కు చెక్ పడినట్టే అని ప్రచారం మొదలైంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో యనమలకు మరోసారి అవకాశం దక్కుతుందని భావించారు.టీడీపీకి దక్కిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండు బీసీలకు కేటాయించినా యనమలకు మాత్రం ఛాన్స్ దక్కలేదు. బీటీ నాయుడు, బీద రవిచంద్రలను బీసీ కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎంపిక చేశారు. యనమల తుని నుంచి 2009 ఎన్నికల్లో తొలి సారి పరాజయం పాలయ్యారు. అప్పుడు కూడా చంద్రబాబు 2013లో ఆయన్ని ఎమ్మెల్సీని చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు యనమల శాసనమండలి సభ్యుడిగా కొనసాగుతూ వచ్చారు. అదీకాక యనమల బంధుగణానికి కూడా చంద్రబాబు పార్టీలో మంచి ప్రాధాన్యతే ఇచ్చారు. యనమల సన్నిహిత బంధువు , టీటీడీ మాజీ ఛైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రస్తుతం మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. పుట్టా మహేష్‌కుమార్ ఏలూరు ఎంపీగా గెలిచారు. యనమల కూతురు తుని ఎమ్మెల్యేగా విజయం సాధించారుఅయినా తనకు టికెట్ దక్కకపోవడంపై యనమల ఎలా రియాక్ట్ అవుతారా అన్న అంశంపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వాస్తవానికి చంద్రబాబు తన కేబినెట్ లో యనమలకు అవకాశం ఇవ్వకపోవడంతో.. ఇప్పటికే యనమల ఒకింత అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి కొలువుదీరిన తరువాత కాకినాడ పోర్టు విషయంలో తెలుగుదేశం తీసుకున్న నిర్ణయాన్ని, అనుసరించిన విధానాన్ని వ్యతిరేకిస్తూ యనమల కొన్ని వ్యాఖ్యలు చేయడంతో ఆయన పార్టీకి దూరం జరుగుతున్నారా అన్న అనుమానాలు కూడా అప్పట్లో వ్యక్తం అయ్యాయిపొలిటికల్ గా ఎప్పుడు గుంభనంగా ఉండే యనమల రామకృష్ణుడు కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక సమయంలో ఆయన తన అసహనాన్ని వ్యక్తం చేశారు. బీసీ కోటాలో ఆయన ఆ పదవి ఆశించారు. దక్కకపోయేసరికి కొంత అసంతృప్తికి లోనై అధ్యక్షుడికి లేఖ రాశారు.ఇక ఇప్పుడు తాజాగా ఆయనకు ఎమ్మెల్సీగా మరో అవకాశం ఇవ్వకపోవడంతో యనమల ఎలా రియాక్ట్ అవుతారన్న ఆసక్తి నెలకొంది. మరోవైపు యనమల పార్టీకి చేసిన సేవలను దృష్టిలో పెట్టుకుని హై కమాండ్ ఏదో ఒక కీలకపదవి ఇస్తుందని, లేదా 2027 లో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ స్థానాల్లో అయినా ఆయనకు చోటు కల్పిస్తారని యనమల సన్నిహితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి చూడాలి యనమల పొలిటికల్ ఫ్యూచర్ ఎలా ఉండబోతుందో?

# పది సూత్రాలతోనే పోస్టులు

తిరుపతి : తెలుగుదేశం పార్టీ నామినేటెడ్ పోస్టు భర్తీ విషయంలో కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తుండటంతో దిగువ స్థాయి నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాము పడిన కష్టానికి ఈసారైనా ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. ఇటు కూటమిలోని అన్ని పార్టీలూ నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యేల నుంచి ముఖ్య నేతలు, కార్యకర్తల పేర్లను పంపాలని చంద్రబాబు నాయుడు సూచించడంతో వారు ఇప్పటికే అన్ని నియోజకవర్గాల నుంచి పేర్లు అయితే వచ్చాయి. పోటీ మాత్రం తీవ్రంగా ఉంది. ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై ఇంకా కసరత్తు కొనసాగుతుంది. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో చంద్రబాబు అనేక సూత్రాలను పాటిస్తున్నారు. ప్రాంతాలు, కులాలు, పార్టీల వారీగా పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమైన, ప్రాధాన్యత కలిగిన పోస్టులకు గత ఎన్నికల్లో సీట్లు దక్కని వారి పేర్లను కూడా పరిశీలిస్తున్నారు. వారిని కొంత కాలం నామినేటెడ్ పదవుల్లో ఉంచితే కొంతలో కొంత ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ తగ్గుతుందని భావిస్తున్నారు. అందుకే మాజీ ఎమ్మెల్యేలను, గత ఎన్నికల్లో టిక్కెట్ రాని వారికి ముఖ్యమైన పోస్టుల్లో నియమించాలన్న ప్రతిపాదన ఒకటి ఆయన సీరియస్ గానే పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం కొన్ని ముఖ్యమైన నేతలకు ఇప్పటికే ఫోన్లు చేసి సమాచారం అందించి వారి అభిప్రాయాలను కూడా తీసుకున్నట్లు చెబుతున్నారు.

రెండు హామీల విధివిధానాలపై చర్చ ప్రధాన దేవాలయాల్లో... ముఖ్యంగా ప్రధాన దేవాలయాల్లో బాగా కష్టపడి పనిచేసిన నేతలకు, కార్యకర్తలకు ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పాలకమండలిని భర్తీ చేసే ఉద్దేశ్యంతో ఉన్న ఆయన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ముఖ్యమైన నేతలకు ఇవ్వాలని భావిస్తున్నారు. పోస్టులు తక్కువ, పేర్లు ఎక్కువగా ఉండటంతో మొదటి రెండు జాబితాల్లో రాని వారికి మలి జాబితాలో చోటు కల్పించాలని చూస్తున్నారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలతో పాటు తాను సొంతంగా నియోజకవర్గాల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఆయన పేర్లను ఖరారు చేస్తుండటంతో పాటు లోకేశ్ సూచించిన వారికి కూడా కొంత ప్రాధాన్యత దక్కే అవకాశాలున్నాయి. దీంతో తమ్ముళ్లలో టెన్షన్ నెలకొంది. తమకు ఈసారైనా పదవులు వస్తాయా? రావా? అన్న దానిపై ఆందోళనలో ఉన్నారు.

# అమరావతికి రీ లాంఛ్

విజయవాడ : ఏపీ కలల రాజధాని అమరావతి స్వయం సమృద్ధి ప్రాజెక్టుగా ఘనంగా రీలాంఛ్ కాబోతోంది. ఒక్కసారి పనులు మొదలు పెట్టి మూడేళ్లలో పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం పట్టుదలగా ఉంది.ప్రధాని చేతుల మీదుగా రీలాంఛ్ కు రెడీ అవుతోంది. అవును ఆంధ్రుల కలల రాజధానికి కొత్త రెక్కలు వచ్చేశాయ్. ఇప్పుడు ఎలాంటి ఆటంకాలు లేవ్. అడ్డంకులు అసలే లేవు. గ్రహణాలన్నీ వీడిపోయాయ్. రోడ్ మ్యాప్ క్లియర్ గా ఉంది. టార్గెట్ కనిపిస్తూనే ఉంది. అందాల్సిన నిధులు వస్తూనే ఉన్నాయి. చేయాల్సిన పనులు ఖరారయ్యాయ్. కలల్ని సాకారం చేస్తూ అద్భుతమైన, అందమైన రాజధాని అమరావతి సాక్షాత్కారం చేసుకునేందుకు రీస్టార్ట్ అవుతోందిఅమరావతికి ఇప్పుడు అన్నీ మంచి శకునాలే కనిపిస్తున్నాయి. 2028 నాటికి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. అన్ని పనులను మరికొద్ది రోజుల్లోనే ఒకేసారి మొదలు పెట్టి రాజధాని నిర్మాణ పనుల్ని రీలాంఛ్ చేయబోతోంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా పనుల్ని అట్టహాసంగా మొదలు పెట్టబోతోంది చంద్రబాబు ప్రభుత్వం. ఆంధ్రుల ఆశల్ని సజీవంగా ఉంచుతూ సరికొత్త రాజధానిని ఆవిష్కరించేందుకు పెద్ద ముందడుగు పడబోతోంది. ఇక ఒక్కసారి పని మొదలైందంటే ఆగేదే లేదు. ఎక్కడా తగ్గేదే లేదు. 2028 దాకా నాన్ స్టాప్, అన్ స్టాపబుల్ అంతే.నిజానికి అమరావతి కాల పరీక్షకు తట్టుకుని నిలబడింది. గతంలో చేపట్టిన నిర్మాణాలు స్ట్రాంగ్ గానే ఉన్నాయని టెక్నికల్ కమిటీలు తేల్చాయి. అందుకే వాటి పనుల్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడమే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముందుంది. అటు చంద్రబాబు సర్కార్ కూడా ఈసారి గట్టి సంకల్పమే తీసుకుంది. అటు చూస్తే కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా పూర్తిగా ఉండడంతో కచ్చితంగా రాజధానిని నిర్మించి నిలబెట్టి జనం ముందు ఉంచేలా మాస్టర్ ప్లాన్ రెడీ చేసింది. అమరావతి అంటే తిరుగులేనిది. ఈ పేరుకు ఓ బ్రాండ్ ఉంది. స్టామినా ఉంది. అంతకు మించి హిస్టరీ ఉంది. ఎవరు వచ్చినా.. ఇంకెవరు పాలించినా.. రాజధానిగా అమరావతి చెరిగిపోని ముద్ర వేయబోతోంది. చరిత్ర సృష్టించబోతోంది. ఎన్ని కాలాలైనా సగర్వంగా చెప్పుకునేలా ఉండబోతోంది.రాజధాని ఈ ప్రాంతంలోనే ఏర్పాటవుతుందని చెప్పడమే తరువాయి. 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల త్యాగం వృధాగా పోలేదు. వారి పోరాటాలు వృధా అవలేదు. రాజధాని నిర్మాణం కోసం 64 వేల కోట్లు అవసరమవుతున్నాయ్. ఈ నిధులతో ఒక అడగు ముందుకు పడితే మిగితా పనులన్నీ వెంట వెంటనే జరగడం ఖాయమే. ఇది సస్టైనబుల్ ప్రాజెక్ట్. రాజధాని అన్నది అవకాశాలను సృష్టిస్తుంది. ఉపాధిని పెంచుతుంది. సౌకర్యాలు తీసుకొస్తుంది. సంపదను సృష్టిస్తుంది. అంటే పెట్టిన ఖర్చు తీరడమే కాదు.. అంతకు మించి ఎవరూ ఊహించని ప్రయోజనాలను రాజధాని అందించబోతోంది.పీపుల్స్ క్యాపిటల్ అని రాజధాని అమరావతికి క్యాప్షన్ ఇచ్చారు. అంటే అందరినీ అక్కున చేర్చుకునేలా ఉపాధి అవకాశాలు పెంచేలా, ప్రపంచంలోనే టాప్-5 నగరాల్లో ఒకటిగా ఉండేలా డిజైన్ చేశారు. మోస్ట్ అడ్వాన్స్ డ్ టెక్నాలజీతో పాటు మెరుగైన మౌలిక వసతులు రాబోతున్నాయి. నెక్ట్ జెనరేషన్ క్యాపిటల్ సిటీ ఎలా ఉంటుందో అమరావతి పూర్తయ్యాక చూస్తే తెలుస్తుంది. నిజానికి రాజధాని నిర్మాణం ఎవరికీ రాని, చాలా అరుదైన అవకాశం. దీన్ని సీఎం చంద్రబాబు సంపూర్ణంగా పూర్తి చేసేలా బాధ్యత భుజానికెత్తుకున్నారు. కలల రాజధానిని సాకారం చేసి చూపిస్తామన్నారు.అమరావతిలో 40 వేల కోట్ల రూపాయల విలువైన నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీయే సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజధానిలో నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టు ఏజెన్సీలకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ పూర్తికాగానే రాజధానిలో పనులు ప్రారంభం అయ్యే ఛాన్స్ ఉంది. 73 పనులకు సీఆర్‌డీఏ నుంచి అనుమతి వచ్చింది. 63 పనులకు టెండర్లు పూర్తి చేశారు. వాటి విలువ 39,678 కోట్లుగా ఉంది. అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ లో ఇళ్లు, భవన నిర్మాణాలు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం మొత్తంగా 64 వేల 721 కోట్లు అవసరం కానున్నాయి. వివిధ రకాల ఆదాయ మార్గాల ద్వారా అమరావతి పనులు చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రెడీ చేసి పెట్టుకుంది.అమరావతికి వరల్డ్ బ్యాంకు, ఏడీబీ బ్యాంకు కలిపి 13 వేల 400 కోట్ల రూపాయల రుణం ఇస్తుండగా, ఐఈచి బ్యాంక్ 5 వేల కోట్ల రూపాయల రుణం ఇస్తోంది. అటు హడ్కో 11 వేల కోట్లు అప్పుగా ఇవ్వబోతోంది.

అయితే ఈ అప్పులను ఎఫ్ఆర్బీఎం పరిధిలోకి తీసుకురాబోమని కేంద్రం తాజాగా పార్లమెంట్ సాక్షిగా ప్రకటించింది. ఈ రుణాలను ఆంధ్రప్రదేశ్ అప్పుల పరిమితిలో లెక్కించకూడదని నిర్ణయించినట్లు పార్లమెంట్‌కు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు. 2014-19లో 131 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రతిష్ఠాత్మక సంస్థలకు 1,277 ఎకరాలు ఇచ్చారు. అయితే గత ఐదేళ్లు రాజధాని నిర్మాణం జరగకపోవడంతో ఆ సంస్థల్లో కొన్ని వెనక్కు వెళ్లాయి. భవనాలు నిర్మించుకునేందుకు ఇంట్రెస్ట్ చూపలేకపోయాయి. ఇందులో ఆర్బీఐ, బిట్స్ పిలానీ సహా కీలక సంస్థలెన్నో ఉన్నాయి.

ఇప్పుడు మళ్లీ కదలిక వస్తోంది. తాజాగా 31 సంస్థలకు 629 ఎకరాలు భూమి ఇచ్చారు. గత ప్రభుత్వం ఆర్-5 జోన్‌లో 50 వేల మందికి ఒక సెంటు భూమి అమరావతిలో ఇచ్చింది. అయితే వారికి వేరేచోట భూమి కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం అంటోంది.కూటమి ప్రభుత్వం వచ్చాక 8 నెలల్లో సమస్యలు పరిష్కరించి టెండర్లు ఆహ్వానించిన పరిస్థితి ఉంది. దీన్ని ప్రయారిటీగా తీసుకోవడంతోనే ఇదంతా జరుగుతోంది. ఈనెల 17న జరిగే కేబినెట్‌లో వీటన్నింటికీ ఆమోదం పొంది వెంటనే పనులు ప్రారంభించబోతున్నారు. ఏప్రిల్ నెల నుంచి అమరావతి అభివృద్ధి పనుల్లో 20 వేల మంది పాల్గొనబోతున్నారు. ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బిడ్జ్ సహా ఇంకెన్నో రాబోతున్నాయి. ఈ పనులన్నిటికీ ప్రధాని మోడీ రీలాంఛ్ చేయడం ద్వారా నాన్ స్టాప్ గా జరగబోతున్నాయి. అటు రాజధాని ప్రాంతంలో అభివృద్ధి చేసిన ప్లాట్లను మూడేళ్లలో రైతులకు అప్పగిస్తారు.



# వర్గీకరణ విజయం మాదిగ అమరవీరులదే

**వేద న్యూస్, కమలాపూర్ :**

ఇటీవల జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ చట్టం ఏకగ్రీవంగా ఆమోదం పొందడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కమలాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ కమలాపూర్ మండల అధ్యక్షులు ముత్యాల రమేష్ మాదిగ ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిళ్ల రాజు మాదిగ మాట్లాడుతూ తమ నాయకుడి కృషి ఫలితంగానే వర్గీకరణ చట్టం అసెంబ్లీలో ఆమోదం పొందిందని తాము భావిస్తున్నట్లు తెలిపారు. అసలు వర్గీకరణ ఉద్యమానికి ఊపిరి పోసి నిర్విరామంగా ఎన్నో పోరాటాలు చేసి, మాదిగ జాతి బిడ్డలకు వర్గీకరణ ద్వారానే న్యాయం జరుగుతుందనే తలంపుతో 30 సంవత్సరాల కింద మొదలుపెట్టిన వర్గీకరణ ఉద్యమం నేటి వరకు అలుపెరుగక, విశ్రమించక పోరాటాన్ని కొనసాగించిన గొప్ప వ్యక్తి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అని వారు కొనియాడారు. ఇంకా వారు మాట్లాడుతూ వర్గీకరణ విజయం మాదిగ అమరవీరులకే చెందుతుందని, ఆ కారణంగానే ఈ విజయాన్ని అమరవీరులకే అంకితమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పి జిల్లా ఉపాధ్యక్షులు చిలువేరు సంపత్ మాదిగ, ఎమ్మెస్పి జిల్లా కార్యదర్శి శనిగరపు రవీందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కమలాపూర్ మండల ఉపాధ్యక్షులు ఇసంపెల్లి రమేష్ మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి ఇనుముల చంద్రమౌళి మాదిగ, మండల కార్యదర్శి ఇసంపెల్లి రాజ్ కుమార్ మాదిగ, ఎంఎస్పి మండల నాయకులు నద్దునూరి ప్రసాద్ మాదిగ, ఇసంపెల్లి జయరాజ్ మాదిగ, ఇనుగాల సమ్మయ్య మాదిగ, జన్ను రమేష్ మాదిగ, కొయ్యడ సునీల్ మాదిగ, శనిగరపు రాజ్ కుమార్ మాదిగ, జన్ను సది మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు పైసల్లేవు.. కానీ అందాల పోటీకి కోట్లు..

■ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణ బడ్జెట్ పై మాజీ మంత్రి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి..ఆర్థిక శాఖ మంత్రి భట్టీ విక్రమార్క మల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అరచేతిలో వైకుంఠం ఆద్యంతం అబద్ధం..ఇదే సారాంశం. 72 పేజీల భట్టి ప్రసంగం గురించి చెప్పాలంటే బడ్జెట్ లో రెండు పేజీలు పెరిగింది తప్ప, పేదల సంక్షేమం పెరగలేదు అని విమర్శించారు. “తన సిద్దిపేట నియోజకవర్గంలోనే రెండు లక్షల లోపు రుణం ఉన్న 10,150 మంది రైతులకు రుణమాఫీ జరగలేదు. కానీ రైతులందరికీ పూర్తిగా రుణమాఫీ చేసినం అని భట్టీ విక్రమార్క అన్ని అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. మధిర నియోజకవర్గానికి వెళ్లి రుణమాఫీ అయిందా అని రైతులను అడుగుదామా భట్టి గారు? అని సవాల్ చేశారు. బడ్జెట్ లో అందాల పోటీల కోసం మాత్రం రూ.250 కోట్లు బడ్జెట్లో పెట్టారు కానీ మహిళలకు ఇస్తానన్న రూ.2500 కోసం మాత్రం నయాపైసా బడ్జెట్లో పెట్టలేదని హెద్దేవా చేశారు. ఈ సంవత్సరం మద్యం ద్వారా 50 వేల కోట్లు రావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆశిస్తున్నాడు. ఇప్పటికే బీర్ల ధరలు పెంచిండు.. లిక్కర్ ధరలు పెంచుతున్నాడు. కొత్త



బ్రాండ్లు తెస్తున్నాడు. గత సంవత్సరం రూ.5,888 కోట్ల రెవెన్యూ మిగిలి ఉంది.ఈ సంవత్సరం రూ.2,738 కోట్లు రెవెన్యూ మిగిలి ఉంటుంది అని బడ్జెట్ బుక్ లో రాసారన్నారు. కానీ రేవంత్ రెడ్డిని ఉద్యోగులు జీతాలు అడిగితే రూ.500 కోట్లు కూడా లేవు అని అబద్ధాలు చెప్తున్నాడని ఆరోపించారు. తెలంగాణలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కడతామని రూ.22,500 కోట్లు గత సంవత్సరం బడ్జెట్‌లో పెట్టారు. అందులో ఎన్ని డబ్బులు ఖర్చు పెట్టారు. ఎంత మందికి ఇండ్లు ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇళ్ళు కట్టుకోవడానికి రూ.1 లక్ష అదనంగా ఇస్తాం అని గత సంవత్సరం బడ్జెట్‌లో పెట్టారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో అసలు ఆ ముచ్చటనే లేదని విమర్శించారు.

# వర్మ త్యాగంపై సోషల్ మీడియాలో ఫైట్

కాకినాడ : జనసేన ఆవిర్భావ దినోత్సవం నాడు పిఠాపురంలో జరిగిన సమావేశం తర్వాత రాష్ట్రంలో కూటమిలోని ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేన క్యాడర్ మధ్య గ్యాప్ పెరిగింది. పిఠాపురం వేదికగా చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల క్యాడర్ సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకునే పరిస్థితి ఏర్పడింది. పార్టీ అగ్రనేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య కెమెస్ట్రీ బాగానే ఉన్నప్పటికీ క్యాడర్ మాత్రం పూర్తిగా ఈ సభ తర్వాత విడిపోయినట్లే కనిపిస్తుందని సోషల్ మీడియాలో పోస్టింగ్ లు చూస్తుంటే అర్థమవుతుంది. ఇద్దరు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ఎవరి వల్ల గెలుపు అనే అంశంపై తమకు తోచినట్లు పెడుతున్న కామెంట్స్ కాక రేపుతున్నాయ్. జయకేతనం సభలో పవన్ కల్యాణ్ తో పాటు నాగబాబు చేసిన వ్యాఖ్యలు ఉష్ణోగ్రతల కంటే గరిష్టంగా హీట్ ను రెండు పార్టీలలో పుట్టించిందనే చెప్పాలి. నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న తెలుగుదేశాన్ని తానే నిలబెట్టానని పవన్ కళ్యాణ్ అన్న కామెంట్లు, వర్మను ఉద్దేశించి నాగబాబు పరోక్షంగానే చేసిన కామెంట్ల పైనే ఇప్పుడు సోషల్ మీడియాలో తమ్ముళ్లు బాధపడిపోతున్నారు. తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలభై ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీని ఒకరు నిలబెట్టేదేంటని ప్రశ్నిస్తున్నారు. తమకు 175 నియోజకవర్గాల్లో ఓటు బ్యాంకు, క్యాడర్ బలంగా ఉందని, జనసేన ఎన్ని నియోజకవర్గాల్లో బలంగా ఉందో చెప్పాలంటూ నిలదీస్తున్నారు. ఈ విషయాలు తెలియకుండా మాట్లాడితే ఊరుకోబోమంటూ ఒకరకంగా వార్నింగ్ లు ఇచ్చినట్లే వారి కామెంట్స్ కనపడుతున్నాయి జనసేన క్యాడర్ కూడా ధీటుగానే సమాధానం ఇస్తుంది. నిజానికి జైల్లో ఉన్న చంద్రబాబును పవన్ కల్యాణ్ పరామర్శించడం దగ్గర నుంచి కూటమి ఏర్పాటు వరకూ ఆయన చేసిన కృషిని మరిచిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కష్టకాలంలో ఉన్న టీడీపీని పవన్ కల్యాణ్ ఆదుకున్న విషయాన్ని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందేనని, ఆయన చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని నిలదీస్తున్నారు. తాము కష్టపడి పనిచేయడం, తక్కువ సీట్లకే పోటీ చేయడం, ఉభయ గోదావరి జిల్లాల్లో తమకు పట్టున్నా ఓటు చీలకుండా కూటమి గెలుపునకు కారణం ఎవరని వారు సోషల్ మీడియా వేదికగా అంటున్నారు. దీంతో .. కూటమి మధ్య అగాధం ఏర్పడుతుందనే ఆందోళన ఇరు పార్టీల నేతల్లో కనిపిస్తుంది. నాగబాబు విషయాన్ని పెద్దగా సీరియస్ గా తీసుకోకపోయినా.. వర్మ చేసిన త్యాగాన్ని ఆయన కించపర్చడం ఏంటని టీడీపీ క్యాడర్ గుర్రుగా ఉంది. గతంలో వర్మ స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినప్పుడు ఎవరికి ఎన్ని ఓట్ల శాతం వచ్చాయో తెలుసుకుంటే బాగుంటుందని కూడా సూచిస్తున్నారు. కూటమి అంటే కలసి పోటీ చేయడం, కలసి పనిచేయడమేనని, అంతే తప్ప ఏ ఒక్కరి వల్లో విజయం సాధ్యం కాదని, రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని భావించి జనం ఓట్లేశారని తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. ఇదే సమయంలో జనసేన ను కించపరిస్తే నష్టపోయేదే మీరేనంటూ జనసైనికులు కూడా హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద జయకేతనం సభ మాత్రం రెండు పార్టీల క్యాడర్ లో గ్యాప్ మాత్రం బాగానే కనిపిస్తుంది.

ఇద్దరూ సంయమనం పాటిస్తేనే మంచిదని, లేకుంటే ఇరువురికి నష్టమన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది.



# టీయూడబ్ల్యూజే ను విమర్శిస్తే ఖబడ్దార్

## జర్నలిస్టులు అనుభవిస్తున్న ప్రతి సంక్షేమం టియుడబ్ల్యూజే కృషి ఫలితమే

## కరీంనగర్ జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలి - టియుడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ



కరీంనగర్ : నిరంతరం జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న టియుడబ్ల్యూజె ను విమర్శిస్తే సహించేది లేదని టియుడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ అన్నారు. టి యు డబ్ల్యూ జిల్లా అధ్యక్షులు గాండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన టీయూడబ్ల్యూజే కరీంనగర్ జిల్లా శాఖ విస్తృత సాయి కార్యవర్గ సమావేశం స్థానిక ఎస్ ఆర్ ఆర్ బ్యాంకెట్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి రామనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ 70 సంవత్సరాల్లో అనేక విజయాలు సాధించిన ఘనత టీయూడబ్ల్యూజే దేనని అన్నారు. అనేక అసంఘటిత శక్తులు యూనియన్ విచ్చిన్నం చేయాలని చూసిన కొట్లాడి గెలిచిన సంఘం మనది అన్నారు. సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి అత్యధిక జర్నలిస్టుల సభ్యత్వం కలిగిన సంఘంపై ఉసిగొలిపిన కొట్లాడి నిలబడిన చరిత్ర టీయూడబ్ల్యూజేకు దక్కిందన్నారు. ఈరోజు ప్రతి జర్నలిస్టు పొందుతున్న సంక్షేమం టియుడబ్ల్యూజే కృషి ఫలితమేనని అన్నారు. అనేక ప్రత్యర్థి యూనియన్లు అసత్య ఆరోపణలతో జర్నలిస్టులను తప్పిదారి పట్టిస్తూ కోర్టులను సంప్రదించిన టి యు డబ్ల్యూ జె యూనియన్ నిబద్ధతను చూసి ప్రత్యర్థి సంఘాలకు కోర్టు లు మొట్టికాయలు వేసిన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. నాటికి నేటికీ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న యూనియన్ ఏదన్నా ఉందంటే అది టీ యు డబ్ల్యూ జెనన్నారు. కరీంనగర్ పట్టణ జర్నలిస్టుల నివేషణ స్థలాల సమస్య జటిలం అయ్యేందుకు గత పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. జర్నలిస్టులకు సరైన ప్రోసిడింగ్ ఇవ్వకుండా జర్నలిస్టుల మధ్య అవరోధం సృష్టించారన్నారు. అయినా జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. నివేషణ స్థలాల సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర కమిటీ అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉందన్నారు. టి యు డబ్ల్యూ జె నుండి బహిష్కృత నేత పైశాచిక ఆనందంతో కేసులు వేస్తూ ఆనందిస్తున్నాడన్నారు. వేసిన కేసులు కోర్టులో వీగిపోయి ఆయనకు పరాభవం తప్పదన్నారు. మూడు దశాబ్దాల పాటు యూనియన్ తో ప్రయోజనం పొంది సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి వేలివేయబడ్డ నాయకుడు నేడు జర్నలిస్టులను తప్పుదోవ పట్టించడం పట్ల కరీంనగర్ జర్నలిస్టులు జాగ్రత్తగా ఉండాలన్నారు. జర్నలిస్టులంతా సంఘటితంగా ఉండి తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని అడ్డుకోవాలని అన్నారు. జిల్లా జిల్లా నాయకత్వం జర్నలిస్టులతో సమన్వయంతో ఉంటూ రాష్ట్ర కమిటీ చేసే కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని సూచించారు. జర్నలిస్టుల ఆరోగ్య సమస్యలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి తో చర్చలు జరిపామని ఆయన సానుకూలంగా స్పందించారని అతి త్వరలో మనం కోరుకునే విధంగానే రిజల్ట్ వస్తుందన్నారు. జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ ను సైతం పునరుద్ధరించాలన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన అక్రిడేషన్ జీవో అస్తవ్యస్తంగా ఉండడంతో నూతన జీవో జారీ చేయాలని కోర్టు తీర్పు నివ్వడంతో ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఇచ్చిన నివేదిక మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి అందజేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందుతుందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా మండల స్థాయి రిపోర్టర్లకు సైతం అక్రిడిటేషన్లను అందించిన ఘనత టి యు డబ్ల్యూ జే కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొయ్యడ చంద్రశేఖర్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్,.. కరీంనగర్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఊరేడి రవీందర్ ఐజేయూ సభ్యుడు జానంపేట మారుతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇమామ్, రాష్ట్ర హెల్త్ కమిటీ సభ్యులు బల్మూరు విజయ్ రావు, మహేంద్ర చారి, కోశాధికారి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు గాండ్ల సంపత్, శైలేందర్ రెడ్డి ఎండి సుకుర్, భరణి కుమార్ సంయుక్త కార్యదర్శులు సిర్ర తిరుపతి కొండల్ రెడ్డి పొలు సంపత్ దాడి సంపత్ లతోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

# ఎడారిగా మారనున్న ఎల్ఎండీ?



కరీంనగర్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నీటి సమస్య ముప్పు ముంచుకొస్తుంది. జలాశయాల్లో శరవేగంగా నీటి మట్టాలు ఘననీయంగా పడిపోతున్నాయి. ఎండవేడి వడగాడ్పులతో పంట సహపొలాలు తడారి ఎండిపోతున్నాయి. సాగు నీరు అందించి ఎండుతున్న పంటలను కాపాడాలని రైతులతోపాటు రాజకీయ పార్టీలు ఆందోళన బాట పట్టాయి. దీంతో పంటలను కాపాడేందుకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా నీటి విడుదల చేస్తున్నారు. భారీగా నీటిని కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తుండడంతో జలాశయాలు ఖాళీ అవుతున్నాయి. ఈ నెలాఖరు వరకు సాగునీరు ఇవ్వాలని సర్కారు నిర్ణయించడంతో ప్రస్తుతం ఉన్న నీళ్ళు వారం పదిరోజుల్లో ఖాళీ అయ్యే పరిస్థితులు కనిపిస్తుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది.కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేర్ డ్యామ్ నీటి నిలువ సామర్థ్యం 24 టిఎంసీలు కాగా ప్రస్తుతం 9 టిఎంసి నీళ్ళు మాత్రమే ఉన్నాయి. రోజుకు అర టిఎంసి 6 వేల క్యూసెక్కుల నీటిని కాకతీయ కెనాల్ ద్వారా రైతులకు సాగు నీరు అందిస్తున్నారు. ఎల్ఎండి కి ఎగువన ఉన్న మిడ్ మానేర్ నుంచి 2500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ఎల్ఎండి నుంచి ఆరు వేల క్యూసెక్కుల నీటిని సాగు నీరుగా కాకతీయ కాలువకు విడుదల చేస్తుండగా 300 క్యూసెక్కుల నీళ్ళు మిషన్ భగీరథతోపాటు ఎండ వేడికి ఆవిరైపోతున్నాయి. ఇదే మాదిరిగా సాగునీరు ఇస్తే నాలుగు రోజులకు ఒక టిఎంసి చొప్పున ఈ నెలాఖరు వరకు 4 టిఎంసిల నీళ్ళు ఖాళీ అయి ఎల్ఎండి లో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరనుంది. కరీంనగర్ సిద్దిపేట జిల్లా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్ మొదటి వారంలోనే డెడ్ స్టోరేజ్ నుంచి త్రాగునీరు తీసుకునే పరిస్థితి ఉంటే? మే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన వ్యక్తం అవుతుంది.రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న మిడ్ మానేర్ శ్రీ రాజరాజేశ్వర జలాశయం పూర్తి స్థాయి నీటి నిలువ సామర్థ్యం 27 టిఎంసిలు. ప్రస్తుతం 12.5 టీఎంసీల నీళ్ళు ఉన్నాయి. మిడ్ మానేర్ కు ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా 660 క్యూసెక్కుల నీరు వస్తుండగా మిడ్ మానేర్ నుంచి 2500 క్యూసెక్కుల నీటిని దిగువన ఎల్ఎండి కి మరో 650 క్యూసెక్కుల నీటిని రైట్ మేయిన్ కెనాల్ కు విడుదల చేస్తున్నారు. మరో 220 క్యూసెక్కుల నీళ్ళు ఆవిరైపోతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.ఇదే మాదిరిగా ఎండలు ముదిరి నీటిని విడుదల చేస్తే మార్చి మాసాంతం వరకు మిడ్ మానేర్ లో సైతం భారీగా నీళ్ళు తగ్గనున్నాయి. ఇప్పటికే మిడ్ మానేర్ పై ఆధారం పడ్డ వేములవాడ సిరిసిల్ల మానకొండూర్ నియోజకవర్గాల్లో సాగునీరు అందక వేలాది ఎకరాల్లో పంట పొలాలు ఎండిపోయి రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఉమ్మడి జిల్లాకు జీవనాదారంగా ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో సైతం నీటిమట్టం గణనీయంగా తగ్గింది. 20 టిఎంసీల నీటి నిలువ సామర్థ్యం గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం 10 టిఎంసిల నీళ్ళు ఉన్నాయి. హైదరాబాద్ తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో త్రాగునీటి అవసరాలకు ఆ నీళ్లు సరిపోయే అవకాశం ఉంది. వాటిని పొదుపుగా వర్షాకాలం ప్రారంభం అయ్యేవరకు ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రస్తుతం ఎల్ఎండీ, మిడ్ మానేర్ లో ఘననీయంగా నీటిమట్టం పడిపోతుండడంతో ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోసి సాగునీరు దేవుడెరుగు కనీసం త్రాగునీటి తిప్పల రాకుండా చూడాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు. ముంచుకొస్తున్న మంచినీటి ముప్పును గమనించి అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. నీటి కష్టాలు రాకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు అందుబాటులో లేకుండా పోయింది. మేడిగడ్డ బ్యారేజ్ కి పగుళ్లు రావటంతో? కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టింది మరమ్మత్తు పనులు ముందుకు సాగక కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా నిర్మించిన మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్, అన్నారం సరస్వతి బ్యారేజ్, సుందిళ్ళ వద్ద పార్వతి బ్యారేజీలు నీళ్లు నిలువ చేయకుండా మొత్తం ఖాళీ చేసి గోదావరిని ఏడారిగా మార్చారు. ఇప్పట్లో కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు వచ్చే పరిస్థితి లేదు

# ప్రజలకు పులుల టెన్షన్



వరంగల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలకు పులుల టెన్షన్ పట్టుకుంది. అటవీ ప్రాంతంలోని గ్రామాల శివార్లలో పులి సంచరిస్తున్న ఆనవాళ్లు కనిపించడం, అడపాదడపా మూగ జీవాలపై అటాక్ చేస్తుండటంతో అక్కడి ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రెండు పులుల సంచారం జనాలను కలవరానికి గురిచేస్తోంది.జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ ఏజెన్సీ ప్రాంతంలో ఆడ పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలోని అన్నారం క్రాస్ బీరసాగర్ పోచమ్మ ఆలయం వద్ద రెండు రోజుల కిందట కొంతమంది వాహనదారులు పులిని చూసినట్టు చెబుతున్నారు. అటుగా వచ్చిన పులిని గమనించి, గ్రామస్థులకు సమాచారం చేరవేయగా.. ఆ విషయం కాస్త వైరల్ అయ్యింది(గ్రామస్థులు సంబంధిత అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని, గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. పులి జాడను కనుగొనే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ముఖ్యంగా పులి పాద ముద్రలను గుర్తించారు. మహదేవపూర్ అటవీ ప్రాంతంలో సంచరిస్తుంది ఆడ పులిగా భావిస్తున్నారు. పులిని గుర్తించేందుకు అటవీ ప్రాంతంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. తరచూ పులి కదలికలతో మహదేవపూర్ మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఓ వైపు మహదేవపూర్ ఏజెన్సీ ఏరియాలో ఆడపులి సంచరిస్తుండగా.. భూపాలపల్లి, కాటారం మండలాల్లో మగపులి తిరుగుతుండటంతో జనాలు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం పులి కదలికలను గుర్తించిన కొందరు స్థానికులు.. అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేయడంతో వెంటనే జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్లు కాటారం, భూపాలపల్లి మండలాల్లో పర్యటించారు. అక్కడున్న పులి అడుగులను గుర్తించి, దానిని మగపులి గా భావిస్తున్నారు.మహదేవపూర్, కాటారం మండలాల్లో సంచరించేది ఒకటే పులి అని భావించారు. కానీ అక్కడున్న అడుగులు, ఇక్కడున్న అడుగులకు సరిపోలకపోవడంతో రెండు పులులు సంచరిస్తున్నట్టుగా నిర్ధారణకు వచ్చారు. కాటారం మండలంలో పులి అడుగులు గుర్తించి, అది మగపులిగా తేల్చారు. ఆ పులి కాటారం మండలం మేడిపల్లి, కొత్తపల్లి మీదుగా భూపాలపల్లి మండలం రాంపూర్, కమలాపూర్ గ్రామ శివార్లలో సంచరిస్తుండటంతో.. అటు గ్రామస్థులతో పాటు ఆఫీసర్లు కూడా అలర్ట్ అయ్యారు.జిల్లాలో రెండు వైపులా రెండు పులులు సంచరిస్తుండటంతో కాటారం, మహదేవపూర్ మండలాల్లో టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది. జనాలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. కనీసం పశువులను మేతకు తీసుకెళ్లాలన్నా భయాందోళన చెందుతున్నారు. పులుల సంచారం నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సమీప గ్రామాల ప్రజలను అలర్ట్ చేసే పనిలో పడ్డారు. అటవీ ప్రాంతాల్లోకి పశువుల కాపరులు ఎవరూ వెళ్లొద్దని సూచిస్తున్నారు.పంట పొలాల వద్ద కరెంట్ తీగలు, ఉచ్చులు పెట్టొద్దని, ఒకవేళ ఎవరైనా పులులను హాని కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఒకవేళ ఎవరికైనాపులి ఎదురైతే దాని కళ్లలోకి నేరుగా చూడొద్దని, వెనక్కి తిరగకుండా వెనక్కి నడవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో పరుగెత్తకూడదని, పెద్ద శబ్దం చేస్తూ ఉండాలని సూచించారు.ఎవరికైనా పులి కనిపిస్తేవెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు

# సిఏ ర్యాంకర్ సిరిని సన్మానించిన ఐటీ కమిషనర్

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన చేరాల రాజ్ కుమార్ - సరస్వతి దంపతుల కుమార్తె అయినటువంటి చేరాల సిరి ఈ ఏడాది జనవరిలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా నిర్వహించినటువంటి సీఏ ఇంటర్మీడియట్ పరీక్షలో ఆల్ ఇండియా లెవెల్ లో 35వ ర్యాంకు సాధించింది. అయితే హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2025 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఏ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచిన చేరాల సిరి నీ, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఐటీ కమిషనర్ జీవన్ లాల్ శాలువాతో సన్మానించి అవార్డు అందజేశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఈ సందర్భంగా విద్యార్థినికి ఆయన సూచించారు. రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసి కమలాపూర్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్ రావు, పోపా రాష్ట్ర అధ్యక్షులు సామంతుల శ్రీనివాస్, కేయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చిర్ర రాజు గౌడ్, డబ్ల్యూ ఈ ఓ జాతీయ అధ్యక్షులు సిహెచ్ భద్ర, శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్(ఎస్ఆర్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ అమరేష్, అడ్వైజర్ పులికంటి రాజేందర్, ఎస్ఆర్ఎఫ్ బృందం తోటరాజు, మధు, సన్నీ, శశి, బాలు తదితరులు పాల్గొన్నారు.

# భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర కు రెండు ఏళ్లు

## కాంగ్రెస్ నాయకుల సంబరాలు



మధిర : మధిర పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీని అధికారం లో తీసుకురావడం కోసం పీపుల్స్ మార్చ్ పాదయాత్ర పూర్తి చేసి రెండు సంవత్సరాలు అయినందున కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. మల్లు భట్టి విక్రమార్క పిఏ శ్రీనివాస్ మరియు మధిర పట్టణ కాంగ్రెస్ నాయకులు ఆదిమూలం శ్రీనివాసరావు దివంగతులైనందున వారి ఆత్మలు శాంతించాలని కాంగ్రెస్ నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించారు... ఈ సందర్భంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ... మార్చి 16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం పిప్పిరి గ్రామంలో ప్రారంభమైన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర..108 రోజులపాటు విజయవంతంగా కొనసాగి ఖమ్మంలో ముగిసింది. 108 రోజుల భట్టి విక్రమార్క గారి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర కాంగ్రెస్లో సరికొత్త ఊపు తీసుకువచ్చింది. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, ఆరోగ్యం క్షీణించిన లెక్కచేయకుండా భట్టి విక్రమార్క పాదయాత్ర చేశారు. 17 జిల్లాలు, 36 నియోజకవర్గాలు, 750 గ్రామాల మీదుగా నిర్విరామంగా 1350 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగిన ఈ యాత్రకు ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభించింది. పాదయాత్రలో భాగంగా గిరిజనులు, ఆదివాసీలు, బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీలు, అట్టడుగు వర్గాలు, అణగారిన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. భట్టి విక్రమార్క గారు ప్రజలతో మమేకం అవుతూ, వారికలో ఒకరిగా నిలుస్తూ,సమస్యల పరిష్కారానికి స్వాంతన కల్పిస్తూ యాత్ర కొనసాగించారు. భట్టి విక్రమార్క పాదయాత్ర కొనసాగిన నియోజకవర్గాల్లో పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం కావడంతో పాటు.. కేడర్ లో సరికొత్త జోష్ నెలకొంది. తెలంగాణ కాంగ్రెస్ నేతలందరికీ ఆప్తుడుగా ఉన్న భట్టి పాదయాత్ర నేతల ఐక్యతకు వేదికగా నిలిచింది. దాని ఫలితమే ఈరోజు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణం అని అన్నారు.... ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిర్యాల వెంకటరమణ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హనుమంతరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర రెడ్డి, మండల ఐఎన్టీయూసీ అధ్యక్షుడు కోరంపల్లి చంటి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోచేపల్లి సురేష్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఫయాజ్, మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కోన ధని కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, పారుపల్లి విజయ్ కుమార్, నిడమనూరు వంశీకృష్ణ, పత్తేపరపు సంగయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్లు అల్లాడి గోపాలరావు, మైలవరపు లక్ష్మీ స్వాతి, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్, పట్టణ కాంగ్రెస్ నాయకులు తలువుల వెంకటేశ్వర్లు, మోదుగు బాబు, మాగం ప్రసాద్, కోట నాగరాజు, మొండితోక సుధాకర్, రామారావు, సిద్ధంశెట్టి సందీప్, మైలవరపు చక్రి, యన్నం కోటేశ్వరరావు, తన్నీరు రామకృష్ణ, సూర్యదేవర కోటేశ్వరరావు, సాలిక సురేష్, మెండం ఎంకన్న, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు బాహటం వనజ, వనపర్తి కళావతి, కోమాకుల రమా, కాంగ్రెస్ నాయకులు ఉట్ల రాంబాబు, షేక్ గౌసిద్దీన్, ఎండి రహీం, కరీముల్లా, సంపసాల రామకృష్ణ, గద్దం ప్రశాంత్ బొల్లె పోగు సత్యానందం, జమిల్ పాష, దూదేకుల జానీ, ఆవుల శీను, గుండా వీరారెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఎల్లప్పుడూ నీరసం, అలసట విపరీతంగా ఉంటున్నాయా..?

## అయితే ఇవే కారణాలు కావచ్చు..!

హైదరాబాద్ : మనం శారీరకంగా, మానసికంగా శ్రమిస్తే అలసటగా అనిపిస్తుంది. దీని కారణంగా నిద్ర వస్తుంది. నిస్సత్తుగా కూడా అనిపిస్తుంది. బాగా అలసట చెందితే నీరసం, ఆయాసం వస్తాయి. దీంతో శరీరం సహజంగానే విశ్రాంతి కోరుతుంది. అయితే ఎలాంటి శారీరక లేదా మానసిక శ్రమ చేయకపోయినా కొందరికి అలసటగా, నీరసంగా ఉంటుంది. ఇలాంటి వారికి ఉదయం నిద్ర లేచినప్పటి నుంచే ఈ విధంగా అనిపిస్తుంది. దీంతో ఏ పని చేయాలనిపించదు. అలాగే కాస్త పని చేసినా కూడా విపరీతంగా అలసట వస్తుంది. ఏమాత్రం శక్తి లేనట్లు ఫీలవుతారు. అయితే ఇలా ఎందుకు జరుగుతుందంటే.. పోషకాహార లోపాన్ని ఇందుకు కారణంగా చెప్పవచ్చు. రోజూ సరైన ఆహారం తీసుకుంటే ఈ సమస్య రాకుండా చూసుకోవచ్చు. పలు పోషకాలు లోపించడం వల్ల కూడా నిరంతరాయంగా అలసట, నీరసం కనిపిస్తాయి.

**ఉదయం తినకపోవడం..**

కొందరు ఉదయం ఎలాంటి ఆహారం తీసుకోరు. నేరుగా మధ్యాహ్నం భోజనం చేస్తుంటారు. వాస్తవానికి ఇలా చేయడం అసలు మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే రోజులో మనకు కావల్సిన ముఖ్యమైన పోషకాలను అందించే ఆహారాన్ని ఉదయమే తీసుకోవాల్సి ఉంటుంది. ఇది మనకు శక్తిని, పోషకాలను రెండింటిని అందిస్తుంది. కనుక ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేయడం తప్పనిసరి. బ్రేక్ ఫాస్ట్ చేయకపోతే శరీరంలో త్వరగా శక్తి నిల్వలు ఖర్చవుతాయి. దీంతో రోజంతా నీరసంగా ఉంటారు. చిన్న పని చేసినా అలసట విపరీతంగా వస్తుంది. కనుక ఉదయం బ్రేక్ ఫాస్ట్ మానేయకూడదు. కచ్చితంగా ఏదో ఒక ఆహారం తినాలి.

**అతిగా ఉపవాసం ఉండడం..**

మధ్యాహ్నం చేసే భోజనం కాస్త ఎక్కువ తిన్నా ఫర్వాలేదు. మధ్యాహ్న భోజనంలో శక్తి, చురుకుదనం కోసం కార్బొహైడ్రేట్లు, ప్రోటీన్లు ఉండేలా చూసుకోవాలి. మధ్యాహ్నం కొవ్వులను తక్కువగా తినాలి. అలాగే మనం యాక్టివ్‌గా ఉండాలన్నా, చురుగ్గా పనిచేయాలన్నా రోజూ తగినంత నీళ్లను తాగాల్సి ఉంటుంది. నీళ్లను సరిగ్గా తాగితే జీవక్రియలు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహించబడతాయి. దీంతో శరీరం క్యాలరీలను ఖర్చు చేస్తుంది. మనకు శక్తి లభిస్తుంది. ఉత్సాహంగా ఉంటారు. నీరసం, అలసట అనేవి ఉండవు. అలాగే వారంలో 1 రోజు ఉపవాసం చేయవచ్చు. కానీ మితిమీరిన ఉపవాసం మొదటికే మోసం వచ్చేలా చేస్తుంది. అతిగా ఉపవాసం చేయకూడదు.

**ఐరన్ లోపించడం..**

శరీరంలో తగినంత ఐరన్ లేకపోయినా కూడా నీరసం, అలసట విపరీతంగా ఉంటాయి. ఐరన్ తగ్గితే కణాలకు ఆక్సిజన్, పోషకాలు సరిగ్గా లభించవు. దీంతో సహజంగానే ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోతాయి. ఇది నీరసం, అలసటను కలగజేస్తుంది. కాబట్టి ఈ లక్షణాలు కనిపిస్తుంటే ఐరన్ లోపం ఉందేమో చెక్ చేయించుకోవాలి. ఐరన్ లోపం ఉంటే డాక్టర్లు ఇచ్చిన మందులను వాడడంతోపాటు ఐరన్ ఉండే ఆహారాలను తినాలి. దీంతో నీరసం, అలసటకు చెక్ పెట్టవచ్చు. అలాగే ప్రోటీన్ల లోపం ఉన్నా, విటమిన్ సి లోపించినా కూడా చాలా మందికి అలసట, నీరసం వస్తుంటాయి. కనుక డాక్టర్‌ను కలిసి సరైన కారణాన్ని శోధించాలి. దీంతో సమస్య నుంచి బయట పడేందుకు అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంగా ఈ రెండు సమస్యలు ఉంటే అసలు నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. దీంతో తీవ్ర అనారోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్త పడిన వారు అవుతారు.

వేద న్యూస్



# కాంగ్రెస్ విద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తుంది

■ మంద శ్రీకాంత్

**వేద న్యూస్, శాయంపేట :**




తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ హన్మకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్ మంద శ్రీకాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ మొదటి గేటు ముందు బుధవారం అసెంబ్లీలో విద్యా రంగానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ విద్య రంగానికి తక్కువ నిధులు కావాలనే రేవంత్ రెడ్డి సర్కారు కేటాయించిందన్నారు. 23 వేల నూట ఎనిమిది కోట్లు రాష్ట్ర విద్య రంగ అభివృద్ధికి సరిపోవు వారు అన్నారు. ఈ తెలంగాణ రాష్ట్రంలో స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్‌కు సంబంధించి రూ.8 వేల కోట్ల దాకా పెండింగ్లో ఉన్నాయన్నారు .ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 7.57 శాతం మాత్రమే నిధులు కేటాయించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ విద్య సంస్థలు అన్ని ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలు హాస్టల్స్ గురుకులాలు యూనివర్సిటీలు అభివృద్ధి కావాలంటే 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయిస్తేనే అభివృద్ధి చెందుతాయి రాను రాను విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసే విధంగా ఉందని వారు అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని కేటాయించి పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్స్ ను ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేసి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలా చేయక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు పురుషోత్తం సాయికుమార్, ఉపాధ్యక్షులు ఏం పరిమళ, సహాయ కార్యదర్శి బీరెడ్డి జస్వంత్, చెన్నూరి సాయికుమార్, అఖిల్, కన్నా రావు, మల్లేష్, గణేష్, అజయ్, రాహుల్,సందీప్, రాజ్ కుమార్,రవళి,రమ్య తదితరులు పాల్గొన్నారు.



## నాగార్జున స్కూలు విద్యార్థుల చేయూత

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామంలో నాగార్జున స్కూల్ విద్యార్థులు ఇంటినుండి ప్రతి సోమవారం గుప్పెడు బియ్యం సేకరణ కార్య క్రమంలో బాగంగా పొదుపు చేసిన యాబై కిలోల బియ్యాన్ని నిరుపేద కుటుంబానికి చెందిన రాయరాకుల లక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు నాగార్జున స్కూల్ విద్యార్థులు అందించారు. స్వర్గీయ లక్ష్మణ్ ఆత్మ కు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ నాగార్జున స్కూల్ విద్యార్థులు ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన స్కూల్ యాజమాన్యాన్ని, విద్యార్థులను. ఇలాంటి కార్యక్రమం నిరుపేద కుటుంబాలకు శ్రీరామ రక్షగా నిలుస్తుందని ఇలాగే ముందుకు సాగాలని తెలుపుతూ గ్రామ అభివృద్ధి కమిటీ మరియు గ్రామ పెద్దలు అభినందనల తెలియజేశారు.



## సిఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

బీసీ కులగణన చేపట్టడంతో పాటు, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం శాసనసభలో,మండలిలో ప్రవేశపెట్టి ఆమోదం తెలిపిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మిర్యాలగూడ మండలంలోని గూడూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టేబోయిన రామలింగయ్య యాదవ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా రామలింగయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీ కులగణన,ఎస్సీ వర్గీకరణ చేయడం ఎంతో చారిత్రక నిర్ణయం అని,బిల్లులకు ఆమోదం తెలపడంతో తన వంతు పాత్ర పోషించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కి,ప్రభుత్వానికి బీసీ,ఎస్సీ కూలల ప్రజలందరూ అండగా ఉంటామని తెలిపారు.




## ఒలంపియాడ్ టాలెంట్ టెస్టులో సిల్వర్ క్రౌన్ విద్యార్థుల ప్రతిభ

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారు నిర్వహించిన ఒలంపియాడ్ టాలెంట్ టెస్టులో నగరంలోని రంగశాయిపేట బెస్తం చెరువు వద్ద గల సిల్వర్ క్రౌన్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల ఫౌండేషన్ వారు నిర్వహించిన పరీక్షలో తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డులు గెలుచుకున్నారు. హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ఎడ్యుకేషన్ ఎక్సేలెన్స్ అవార్డ్స్ పేరిట ప్రముఖుల చేతుల మీదుగా బుధవారం విద్యార్థులకు అవార్డులు అందజేశారు. రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు డి రిత్విక్(6వ తరగతి), జిల్లాస్థాయిలో 2వ ర్యాంకు ఎం సిద్దేశ్వర్(9వ తరగతి), ఏ లక్ష్మన్య(9వ తరగతి), 3వ ర్యాంకు ఏ నవనీత్(6వ తరగతి), జిల్లాస్థాయి ప్రోత్సాహక బహుమతులను ఏ హిమ బిందు (8వ తరగతి), జీ వర్షిత్(8వ తరగతి),బి శ్వేత(9వ తరగతి), షేక్ అఫ్రీన్(8వ తరగతి),వి ప్రవీర్ చంద్ (6వ తరగతి) గెలుపొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ కూచన కవిత, డైరెక్టర్ వడిచర్ల ప్రసాద్ మరియు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



## కమ్యూనిటీ హాల్, గ్రంథాలయానికి భూమి పూజ

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్లో కమ్యూనిటీ హాల్ గ్రంథాలయంకు స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మురళీధర్ రావు సహకారంతో నిర్మానానికి పునాది పడిందని అన్నారు. వీలైనంత త్వరలో ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తి చేస్తామని స్థానిక ప్రజలకు అందుబాటులో తెస్తామని కమిటీ సభ్యుల సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ అన్ని విధాల అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్తామని విద్యార్థులకు విద్యావంతులకు నిరుద్యోగులకు అందరికీ అందుబాటులో ఉండే విధంగా గ్రంథాలయాన్ని త్వరగా నిర్మించి అందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కత్తెరసాల వేణుగోపాల్, మునిసిపల్ అధికారులు ఏఈ ముజామిల్, గ్రంథాలయ కమిటీ సభ్యులు చిలువేరు రవిందర్, ఆడెపు జగన్, పరదేశి రాజేష్, పిట్ట సత్యనారాయణ, కోమాకుల సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు సందీప్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీసీ బిల్లు స్వాగతిస్తు సంబురాలు

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



బీసీలకు విద్యా,ఉద్యోగాల్లో మరియు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రాజకీయ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షనీయమని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వేంకటేశ్వర్లు ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ఈ చట్టం బీసీల మొదటి పోరాట విజయం అని అన్నారు.కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ చట్టం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి,ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు,ఇదే సమయంలో ఈ బిల్లుకు బేషరతుగా మద్దతు తెలిపిన బిఆర్ఎస్,బీజేపీ,ఎంఐఎం,సీపీఐ పార్టీల నేతలకు సమస్త బీసీ సమాజం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆయన అన్నారు.బీసీ బిల్లు ఆమోదం తదుపరి అమలు కోసం ఢిల్లీ కేంద్రంగా జరిగే పోరాటం పైన అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్ ముదిరాజ్,నక్క నాగరాజ్, శంకర్,చందు,రవి,సిద్దు,గోపి, కిషోర్,శివ,మున్నా,మహేందర్, నవీన్,వెంకటేష్,దిలీప్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంఈవోకు ఘన సన్మానం

**వేద న్యూస్, నల్లబెల్లి:**



ఇటీవల నల్లబెల్లి మండల నూతన ఎంఈఓ గా బాధ్యతలు స్వీకరించిన ఎం.అనురాధను పీఆర్టీయూ టీఎస్ మండల కార్యవర్గం నల్లబెల్లి ఎమ్మార్సీలో ఘనంగా సన్మానించింది. ఈ మేరకు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నకిరెడ్డి మహేందర్, ఉడుత రా జేందర్ ఆధ్వర్యంలో ఎంఈవోకు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నకిరెడ్డి మహేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీ యూటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పురం బద్రీనాథ్, కె వెంకట రామ నరసయ్య, లడే రవీందర్, జిల్లా కార్యదర్శి శనిగరం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ ఎమ్మార్సీ సిబ్బంది ఏంఐఎస్ కో ఆర్డినేటర్ రాజేశ్వరి, కంప్యూటర్ ఆపరేటర్ గుండాల విజయ్, ఐఈడిఆర్పి సంధ్య, సిఆర్పిలు రవి, రాజేందర్, రాంబాబు పాల్గొన్నారు.

# ఘనంగా పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జప్తి వీరప్ప గూడెం నందు 2024-25 విద్యాసంవత్సరానికి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలుసమావేశం ప్రధానోపాధ్యాయులు పెద్దిరెడ్డిశిరీష అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత పౌరులుగా ఎదగాలని ఉన్నత పౌరులు అనగానే డబ్బో, హోదానో కాకుండా జీవితంలో సమాజంలో తోటి వ్యక్తులకు సహాయ సహకారాలు అందిస్తూ అందరిచేత మంచనిపించుకుంటూ బ్రతికే వ్యక్తి,నైతిక విలువలను పాటిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. కొవ్వొత్తి తను వెలుగుతూ పదిమందికి వెలుగునిస్తున్నట్లుగా ఇతరులకు ఉపయోగపడే వ్యక్తి సమాజ చైతన్యానికి స్ఫూర్తి నింపుతాడని,అందుకోసమే విద్యార్థులు భవిష్యత్తులో కొవ్వొత్తి లాగా వెలుగుతూ సమాజ చైతన్యానికి ప్రయత్నం చేస్తూ మంచి పౌరులుగా ఎదగాలని అన్నారు.

ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు నారబత్తుల జనార్ధనా చారి జ్ఞాపకార్థం వారి కుమారులు నారాబత్తుల ఉదయ్ పరీక్ష ఉపకరణాలను మాజీ మార్కెట్ కమిటీచైర్మన్ చిట్టిబాబు నాయక్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, దామోదర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి,మాధవి, శ్రీనివాసరెడ్డి, జబ్రామ్, చంద్రకళ, సీఆర్పీ గోవర్ధన్, రవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

**వేద న్యూస్, హన్మకొండ :**

ఎస్సీల వర్గీకరణ విజయం మాదిగ అమరవీరులదని మాదిగ జాతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసి పోరాటాన్ని ముందుకు నడిపిన మాదిగ జాతి నాయకుడు మంద కృష్ణ మాదిగదని ఎంఎస్పీ జాతీయ నేతలు మందకుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు అన్నారు. ఎస్సీల వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా బుధవారం అంబేద్కర్ కూడలిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ అధ్యక్షతన జరిగిన విజయోత్సవాల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఎస్పీ జాతీయ నేతలు మంద కుమార్, మాదిగ వేల్పుల సూరన్న కాపు లు మాట్లాడుతూ 1994 లో ఎస్సీల వర్గీకరణ కోసం రిజర్వేషన్లలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు రావాల్సిన రిజర్వేషన్ వాటా కోసం మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పాటైన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో మాదిగలు చేస్తున్న పోరాటంలో పొన్నాల సురేందర్ మాదిగ నుండి మొదలుకుంటే భారతి మాదిగ వరకు ఎంతోమంది మాదిగ బిడ్డలు వర్గీకరణ కావాలని ఆత్మ బలిదానాలు చేసుకున్నారని అన్నారు. అలాంటి మాదిగ అమరవీరులకు వర్గీకరణ అయినందుకు వారికి ఘనమైన నివాళులు అర్పించి అనంతరం మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడం జరిగిందన్నారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు సాధించుకున్న విజయమని ఇందులో కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీ లేదని




కేవలం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించిందని అన్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం మాదిగ జాతి 30 సంవత్సరాల పైగా అలుపెరుగకుండా పోరాటం చేసిందని ప్రాణ త్యాగం చేశారని లాఠీ దెబ్బలు తిన్నారని ఎంతోమంది మీద కేసులు అయితే జైల్లో పాలు అయ్యారని మరియు ఎమ్మార్పీఎస్ మీద మందకృష్ణ మాదిగ మీద పాలకులు ఎంత కుట్రలు చేసినా కూడా అన్నిటిని తట్టుకొని విజయం సాధించామని అన్నారు.

# డబ్.. డబ్..!?

మొదటి పేజీ తరువాయి

పాల్గొంటున్నాను. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటే నేను పార్టీ మారినట్లు కదా" అని రిప్లయ్ ఇచ్చారంట.

ఇంకోవైపు ఖైరతాబాద్, స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి తమపై అనర్హత వేటు పడటం ఖాయం అని ఫిక్స్ అయ్యారు. అందుకే ఇటీవల ఏకంగా సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆహ్వానించి సుమారు ఎనిమిది వందల కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేయించుకున్నారు. ఇప్పుడు అదే బాటలో దానం నాగేందర్ సైతం నడవనున్నారు. ఉప ఎన్నికలొస్తే పార్టీ మ్యానీయా ఎలాగు పని చేయదు. గత పదిహేను నెలలుగా కాంగ్రెస్ పై తీవ్ర వ్యతిరేకత వస్తుంది.ఈ పరిస్థితుల్లో పార్టీ పేరు కంటే సొంత ఎజెండాతో ఉప ఎన్నికలను ఎదుర్కోవాలని వీరిద్దరూ ప్రణాళికలు రచిస్తున్నారు. మిగతా ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినందుకు ఇటు ప్రజల్లో అటు బీఆర్ఎస్ క్యాడర్‌లో పీకల్లోతు కోపంతో పాటు తీవ్ర వ్యతిరేకత ఉంది. ఇప్పుడు అనర్హత వేటు పడితే ఉప ఎన్నికల్లో ఓటమి ఖాయం. అందుకే పార్టీ మారలేదని అఫిడవిట్ లో తెలిపినట్లు తెలుస్తుంది.

# చాయ్ ఇస్తావా.. గంజాయి కేసు పెట్టనా..?

మొదటి పేజీ తరువాయి

ఎంజీఎంలోని ఓ చాయ్ డబ్బా వ్యక్తితో కానిస్టేబుల్, ఓ ఎస్సై జరిపిన సంభాషణ ఇది.

అయితే, ఎంజీఎంలో విధులు నిర్వహించే పోలీసులు..ఇలా సామాన్య చిరు వ్యాపారస్తులపై దౌర్జన్యం చేయడం సరైనది కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎంజిఎంకి కిరాయి కడుతూ.. కరెంటు బిల్ కడుతూ..తమ చిరు వ్యాపారం కొనసాగిస్తున్నామని..ఫ్రీగా నిర్వహించడం లేదని కావున దీనిపై ఉన్నత అధికారులు విచారణ జరిపి చిరు వ్యాపారస్తులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, W arangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, W arangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073